''వానికేమైందక్కా?'' రాజారాం గొంతు నార్మలైంది.

''పదిరోజ్నుంచీ జొరం. అప్పుడే చల్లొస్తుంది. ఎంటనే గరం రొట్టె పెంకోలై పోతడు....పెయ్యి మీద చెయ్యేస్తే స్సురుపంటది.... తెల్లందాకా నిద్రలేదు....ఒక్కటే మూల్గుడు....శానా పరేశానై పోతుంది..'' నిట్టెండకాలం మున్సిపల్ కుళాయిలోంచి రాల్తున్న నీటిబొట్లలా సత్య లక్ష్మి గొంతులోంచి మాటలు ఆగిఆగి వస్తున్నై. రెండుకళ్ళూ వానాకాలం చెరువులై పోయినై.

"ఒక్క ఇంట్లనే గింత సేపుంటె ఎట్లా?'' రాజారాం అంతరంగం అల్లరి పెట్టింది. ఎందుకైనా మంచిదని—

"అయ్యో పాపం! దావకాన్ల జూపియ్య లేదా?'' సానుభూతి జాలువారింది.

''మొన్ననే తోల్కపోయిన సర్కారు దావకాన్లకు. నాల్గుగంటలు లైన్ల నిల్చుండవెట్టి రెండు గోలీలిచ్చి పొమ్మన్నరు. ఆ గోలీలు ఏ మూలకు వోయినయో....జొరం ఎక్కువనే అయింది....''

''గట్లనా....?'' ఒంటికాలు మీదున్నడు రాజారాం.

''ఔను....మా అయ్యా, మీ బావ గిసొంటి జొరాలతోనే సచ్చి పోయింద్రు గదా!....'' సత్యలక్ష్మి కళ్ళు శ్రావణ మేఘాలైనై. కను కొలుకుల్లోంచి రాలిన నీటిబొట్లు నేలమీద రాలి ఇంకిపోతున్నై.

''వాళ్ళేకాదే....ఇంక శానామంది గిసొంటి జొరాల్తోని పరేశానై తున్నరు. ఆ దేవుని లీల....ఏం జేద్దామక్కా?'' చేతులు పిసుక్కున్నడు.

రెండు నిమిషాలు....ఏం మాట్లాడాలో ఎవరికి తోచలేదు.

"రంగడికేం గాదు గానీ, సభకు మీ యవ్వను గూడా దోల్కరా! మీ ఇంట్ల మూడు ఓట్లున్నై గదా!'' అంటూ వెళ్ళబోతున్న రాజారాం భుజమ్మీద చెయ్యేసి ఆపింది.

